సీపీఎస్‌ను రద్దు చేయాలి


రఘునాథపల్లి: మహాధర్నా వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు


లింగాలఘణపురం: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

రఘునాథపల్లి: సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని యూఎస్‌పీసీ నాయకులు నాగరాజం, దూడయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 12న జిల్లా కేంద్రంలో ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి నిర్వహించనున్న మహాధర్నా వాల్‌పోస్టర్లను బుధవారం మండల కేంద్రంలో వారు ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే పీఆర్సీ కమిటీ వేయాలని, బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేసి కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని పెండింగ్ బిల్లులు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. భాస్కర్, నాగభూషణం, మధుసూదన్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ

లింగాలఘణపురం: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 12న యుఎస్‌పీసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టే మహాధర్నా పోస్టర్‌ను బుధవారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యుఎస్‌పీసీ స్టీరింగ్ కమిటీ జిల్లా నాయకులు ఆకుల శ్రీనివాసు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట జరిగే మహాధర్నాను మండలంలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. మండల కమిటీ నాయకులు గణేష్, శ్రీనివాసు, పరశురాములు, రాములు, శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

కాలంచెల్లిన పార్టీలకు స్వస్తి పలకండి

● పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి


పార్టీలో చేరిన వారితో మంత్రి ఎర్రబెల్లి

దేవరుప్పుల: కాలంచెల్లిన సిద్ధాంతాలతో రాజకీయ ఉనికి కోసం పాకులాడుతున్న రాజకీయ పార్టీకు స్వస్తి పలకాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సింగరాజుపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు అక్కెం అంజయ్య, మేడ నరేష్, మేడ రమేష్ బుధవారం హనుమకొండలో మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ హయాంలో తెలంగాణ అన్ని రంగాల్లో పురోగతి సాధించి దేశానికి మార్గదర్శకంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ లింగాల రమేష్‌రెడ్డి, మేకపోతుల నర్సింహ, వడ్లకొండ పద్మయ్య, సోమయ్య, మాజీ ఎంపీటీసీ భిక్షపతి, బానోతు నవీన్ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ఆశీస్సులతో నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా అహర్నిశలు కృషి చేస్తున్నానని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. ఘన్‌పూర్ ప్రభుత్వ ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ జారీ చేసినందుకు సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతగా స్థానిక సీహెచ్‌సీలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, వైద్యులు, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో బుధవారం కృతజ్ఞాభినందన సభను నిర్వహించారు. ఘన్‌పూర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి ప్రభుత్వ ఆస్పత్రి వరకు ఎమ్మెల్యేను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జెడ్పీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ మారపాక రవి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే ఉద్వేగంగా మాట్లాడారు. జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణాకర్‌రాజు, జెడ్పీటీసీ మారపాక రవి, ఎంపీపీ కందుల రేఖగట్టయ్య, వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి, చిల్పూరు దేవస్థాన చైర్మన్ శ్రీధర్‌రావు, స్థానిక సర్పంచ్ తాటికొండ సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

108, 102 వాహనాల ప్రారంభం

ఘన్‌పూర్, రఘునాథపల్లి మండలాలకు ప్రభుత్వం నూతనంగా కేటాయించిన 108 అంబులెన్స్, 102 అమ్మఒడి వాహనాలను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ఎమ్మెల్యే రాజయ్య ప్రారంభించారు. 108 జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాస్, ఈఎంటీ హరికృష్ణ, మోహన్, జగదీష్, పైలట్, శ్రీనివాస్, రవికుమార్, సంపత్, రాకేష్, రాజు 102 కెప్టెన్ రహీమ్ పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం


తరిగొప్పుల: కేక్ కట్ చేస్తున్న నాయకులు


పాలకుర్తి టౌన్‌లో..


బచ్చన్నపేటలో..

తరిగొప్పుల/పాలకుర్తి టౌన్/బచ్చన్నపేట: యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పలు మండలాల్లో బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా యూత్ నాయకులు ఎన్ఎస్‌యూఐ జెండాలను ఆవిష్కరించి కేక్ కట్ చేసి సంబురాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు ఏడెల్లి శ్రావణ్‌రెడ్డి , రాజేష్ ధరావత్ నాయక్, రాపాక సత్యానారాయణ, మాదాసు హరిష్, పెద్ద కృష్ణమూర్తి, గోనె మహేందర్ రెడ్డి, చిలువేరు సంపత్, గాదెపాక శ్రీను, అర్జుల అరుణ్‌రెడ్డి, దామెర బంటి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ చేనేత ఐక్య వేదిక జిల్లా కార్యదర్శిగా సుధాకర్



చిల్పూరు: జాతీయ చేనేత ఐక్యవేదిక జిల్లా కార్యదర్శిగా మండలంలోని పల్లగుట్టకు చెందిన మాజీ సర్పంచ్ డాక్టర్ పేరాల సుధాకర్‌ను నియమించినట్లు స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ గజ్జెల దామోదర్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ మండలంలో చేనేత కార్మికులు, పద్మశాలీలు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా తెలుసుకుని జాతీయ, రాష్ట్ర అధ్యక్షుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా కృషిచేస్తానని అన్నారు. తనకు పదవి వచ్చేలా కృషిచేసిన జాతీయ, రాష్ట్ర, జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్, రాజు, కృష్ణమూర్తిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పాలకుర్తిలో కోర్టు ఏర్పాటు చేయండి

పాలకుర్తి: పాలకుర్తిలో కోర్టు ఏర్పాటు చేయాలని సీపీఐఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్ రాజా డిమాండ్ చేశారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో రెండో పట్టణంగా అభివృద్ధి చెందుతున్న పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో అడిషనల్ జూనియర్, సివిల్, జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు ఏర్పాటు చేయాలన్నారు. మన్నెపు భుజేందర్, రజిత, జీడి సోమయ్య, శివప్రసాద్, సురేష్, సోమయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

యుద్ధభేరి పోస్టర్ ఆవిష్కరణ


జనగామ: వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

జనగామ: రాజ్యాధికార సాధనే లక్ష్యంగా ఈ నెల 13న తలపెట్టిన పద్మశాలి రాజకీయ యుద్ధభేరి ఛలో కోరుట్ల పోస్టర్‌ను ఆవిష్కరించారు. బుధవారం పట్టణంలో జిల్లా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో వాల్ పోస్టర్, కరపత్రాలు ఆవిష్కరించారు. జిల్లా సంఘం అధ్యక్షుడు వేముల బాలరాజు, పట్టణ పోపా అధ్యక్షుడు వెంకటేష్, చింతకింది మల్లేష్, మంగళపల్లి జనార్దన్, దయాకర్ ఉన్నారు.

పద్మశాలిలు ఐక్యతగా ముందుకు సాగాలి

రఘునాథపల్లి: పద్మశాలిలు ఐక్యత చాటుతూ ముందుకు సాగాలని తెలంగాణ పద్మశాలి సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి చింతకింది కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. ఈ నెల 13న జగిత్యాల జిల్లా కోరుట్లలో నిర్వహించనున్న రాజకీయ యుద్ధభేరి సభ వాల్‌పోస్టర్లను బుధవారం మండల కేంద్రంలోని శ్రీ భక్త మార్కండేయ ఆలయంలో ఆయన సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, భిక్షపతి, కృష్ణమూర్తి, సిద్దయ్య, మధుసూదన్, శ్రీహరి, సోమ నర్సయ్య, బాలరాజు, యాదగిరి పాల్గొన్నారు.

ఏఎన్ఎంల డిమాండ్లు పరిష్కరించాలి

జనగామ: ఏఎన్ఎంల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు కలెక్టరేట్ ఆవరణలో చేపట్టిన నిరసన దీక్షలకు బుధవారం కొమ్మూరి సంఘీభావం తెలిపిన అనంతరం మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్లను రద్దు చేసి ఎటువంటి రాత పరీక్షలు లేకుండా ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, పే స్కేల్ వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి సుధాకర్‌గౌడ్, నాయకులు సిద్దారెడ్డి, బనుక శివరాజ్ యాదవ్, లింగాల నర్సిరెడ్డి, ఎంపీటీసీ గుగ్గిల నర్సయ్య, పిట్టల సతీష్, దాసరి శేఖర్, దాసరి క్రాంతి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

ఏఎన్ఎంలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ మాదిగ, జిల్లా కన్వీనర్ పైసా రాజశేఖర్ డిమాండ్ చేశారు. నిరసన దీక్షలకు సంఘీభావం తెలిపిన అనంతరం వారు మాట్లాడారు. నాయకులు తాళ్లపల్లి కుమార్, గువ్వల రవి, కన్నారపు పరశురాములు, గుర్రం శ్యామ్సన్, రవీందర్, పాలమాకుల జితేందర్, బొట్ల మహేష్, గడ్డం సోమరాజు, కవిత, ఉజ్వల, యాదలక్ష్మి పాల్గొన్నారు.

అధికారంలోకి రాబోయేది కాంగ్రెస్సే

తరిగొప్పుల: సీఎం కేసీఆర్ ఎన్ని జిమ్మిక్కులు, ఆదరబాదరగా సంక్షేమ పథకాలు అమలుచేసిన రాబోయే రోజుల్లో రాష్ట్రంలో అధికారం చేపట్టేది కాంగ్రెస్ పార్టీనే అని కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి వగలబోయిన యాదగిరి అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ రాష్ట్ర ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నాడని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చిన వెంటనే ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రజలకు సీఎం కేసీఆర్ వరాల జల్లు కురిపిస్తున్నాడని, అది కేవలం ఎన్నికల ముందు కేసీఆర్ ఆడే నాటకమన్నారు. లూకా, వీరన్న, సాయిరెడి పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.9,22,341



చిల్పూరు: శ్రీ బుగులు వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీలను బుధవారం దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ డి.సుమతి ఆధ్వర్యంలో లెక్కించారు. రూ.9,22,341 నగదు, అమెరికన్ డాలర్లు 22, ఒక ఓమన్‌రియాల్ వచ్చినట్లు ఈఓ లక్ష్మీప్రసన్న, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు తెలిపారు. ఏఎస్సై జయకుమార్, మల్కాపూర్ ఇండియన్ బ్యాంక్ మేనేజర్ గంగాధర్, రాజేందర్, పద్మశాలి సేవాసమితి బాధ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

శాశ్వత ప్రాతిపదికన దేశాభివృద్ధి

దేవరుప్పుల: బీజేపీ హయాంలోనే దేశం అన్ని రంగాల్లో శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి జరిగిందని జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి అన్నారు. భారతదేశానికి స్వాతంత్ర్యం లభించి 75 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన 'ఆజాదీకా అమృత్ మహోత్సవ్' వేడుకల్లో భాగంగా బుధవారం నిర్వహించిన 'మేరీ మిట్టీ మేరీ దేశ్' కార్యక్రమంలో ధర్మపురం పరిధి పడమటితండాలోని స్వాతంత్ర్య సమరయోధుడు జాటోత్ దర్యా నాయక్‌ను సన్మానించారు. కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలకు నిధులు కేటాయిస్తే బీఆర్ఎస్ ప్రభుత్వం తమవిగా చెప్పుకుంటూ పబ్బం గడుపుతోందని విమర్శించారు. లేగ రామ్మోహన్ రెడ్డి, సౌడ రమేష్ శివరాజ్ యాదవ్, ఎల్లయ్య, నవీన్‌రెడ్డి, సురేష్ యాదవ్, ఉపేందర్, సత్తన్న, గణేష్, రమేష్, రాజోజు నర్సింహాచారి పాల్గొన్నారు.

2003 డీఎస్సీ వారికి 'పాత పెన్షన్' అమలు చేయాలి

జనగామ రూరల్: సీపీఎస్‌ను తొలగించి 2003 డీఎస్సీ వారికి ఓపీఎస్(పాత పెన్షన్ విధానం) అమలు చేయాలని 'తపాస్' జిల్లా పరిశీలకుడు సింగోజు జనార్దన్ అన్నారు. బుధవారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. జీఓ 317 బాధితులకు న్యాయం చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలు వెంటనే విడుదల చేయాలని, ఐఆర్ పరిష్కరిచాలని డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ వద్ద చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు రవికుమార్, ప్రధాన కార్యాదర్శి తిరుపతిరెడ్డి, కోశాధికారి కోటి, పంచాక్షరి, సత్యనారయణ, మనోజ్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుడికి ఘన నివాళి



రమేష్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కడియం శ్రీహరి

రఘునాథపల్లి: మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ కారుడు, బీఆర్ఎస్ నాయకుడు పబ్బ రమేష్ (59) అనారోగ్యంతో హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందిన విషయం విదితమే. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యలు బుధవారం వెర్వేరుగా ఇబ్రహీంపూర్ చేరుకొని మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. రోధిస్తున్న మృతుడి కుమారులు విజయ్, శేఖర్‌లను ఓదార్చి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేసి ఆర్థికసాయం అందజేశారు. మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అదే విధంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు, పరపతి సంఘాలు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. జిల్లా రైతుబంధు సమితి సభ్యుడు మారుజోడు రాంబాబు, మాజీ జెడ్పీటీసీ లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి, మేకల నరేందర్, వారాల రమేష్, కుమార్‌గౌడ్, శాగ నాగరాజు, దొరగొల్ల యాదగిరి,మేకల శంకరయ్య, పుల్ల అబ్బయ్య, మాలోత్ నర్సింహ, పోకల శ్రీనివాస్, గన్నోజు మధు, మోర్తాల ప్రభాకర్, దామెర వెంకన్న, మల్కపురం కుమార్, చింత నరేష్, గ్యార అయిలయ్య, గాజులపాటి లక్ష్మయ్య, కుత్రాల రాజు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

పరామర్శ

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్‌కు జంటపట్టణమైన శివునిపల్లికి చెందిన బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, ముదిరాజ్ మహాసభ జనగామ జిల్లా కార్యదర్శి, శివునిపల్లి మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు బూర్ల శంకర్ ముదిరాజ్ ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడి చేయి విరగగా అతడిని ఎమ్మెల్సీ కడియం శ్రీహరి బుధవారం పరామర్శించారు. ఎంపీటీసీ బూర్ల లతాశంకర్, రైస్ మిల్లర్ల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెలిదె వెంకన్నగుప్తా, సీహెచ్.నరేందర్‌రెడ్డి బ్రహ్మారెడ్డి, గట్టయ్య, సారంగపాణి తదితరులు పాల్గొన్నారు. అలాగే డివిజన్ కేంద్రానికి చెందిన దేవరాజుల సమ్మయ్య ఇటీవల గుండెపోటుతో మృతిచెందగా బాధిత కుటుంబాన్ని కడియం పరామర్శించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉండగా పిల్లల చదువుల కోసం స్థానిక బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు చింతకుంట్ల నరేందర్‌రెడ్డి అందించిన రూ.25వేలు ఆర్థిక సాయాన్ని కడియం చేతుల మీదుగా అందజేశారు.

బ్యాంకు సేవలను వినియోగించుకోవాలి



బచ్చన్నపేట: మండల కేంద్రంలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సేవలను ఖాతాదారులు వినియోగించుకోవాలని బచ్చన్నపేట బ్రాంచ్ మేనేజర్ శివకృష్ణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బ్యాంక్ ఆవరణలో సీబీఐ బ్యాంక్ వ్యవస్థాపకులు స్వరాజ్‌జీ సోబ్‌కస్ రావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వరాజ్‌జీ సీబీఐ బ్యాంకును ముంబాయిలో చిన్న బ్రాంచ్‌తో స్థాపిస్తే ప్రస్తుతం అనేక బ్రాంచ్‌లుగా ఎదిగిందన్నారు. ఖాతాదారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నాణ్యమైన సేవలను అందించడమే లక్ష్యమన్నారు. అనంతరం స్వీట్లను పంపిణీ చేశారు. ఏబీఎంలు యుగేందర్, రమేష్, క్యాషియర్ స్వరాజ్ బాబు, సిబ్బంది రాధిక, రాజు, అరుణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎస్సైకి సన్మానం

దేవరుప్పుల: స్థానిక పోలీస్‌స్టేషన్‌కు ఇటీవల బదిలీపై వచ్చిన ఎస్సై శ్రవణ్‌కుమార్‌ను కొడకండ్ల మార్కెట్ డైరెక్టర్ మైదం జోగేశ్వర్, బీఆర్ఎస్ యూత్ విభాగం సీనియర్ నాయకుడు కాముని పరమేశ్వర్ బుధవారం కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ శాంతి భద్రతలు కాపాడే దిశలో అన్నివర్గాల ప్రజల సహకారాలు అందించాలన్నారు.

తహసీల్దార్‌కు..

బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించినందుకు మండలంలోని పలు గ్రామాల రేషన్ డీలర్లు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ విశాలాక్షిని సన్మానించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుపతి, రాజేష్‌ఖన్నా, అంజయ్య, బుచ్చయ్య, పుణ్యవతి ఉన్నారు.

కమీషన్ పెంపుపై హర్షం

చిల్పూరు: ప్రభుత్వం రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించేందుకు కమీషన్ పెంపు హర్షనీయమని చిల్పూరు మండల సంఘం అధ్యక్షుడు ఎడ్ల మల్లయ్య అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కమిషన్ పెంచుతూ ఆదేశాలు జారీ చేయడం శుభపరిణామమన్నారు.

కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ



జనగామ రూరల్: పీడిత ప్రజల కోసం నిరంతరం తన గళాన్ని వినిపించిన గొప్ప ప్రజాగాయకుడు గద్దర్ అని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహంవద్ద అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో గద్దర్ ఆత్మకు శాంతికలగాలని కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. సీయాసత్ ఎడిటర్ అలీఖాన్‌కు కూడా నివాళులర్పించారు.

నిందితుడి రిమాండ్


నిందితుడు సభావత్ తరుణ్

తరిగొప్పుల: నిలిపి ఉన్న ఆటో నుంచి వెండి, బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లిన నిందితుడిని జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించినట్లు ఎస్సై దూదిమెట్ల నరేష్ బుధవారం తెలిపారు. మండలంలోని బోజ్యాతండా శివారు గుడిబండ తండాకు చెందిన భూక్య రాజు జీవనోపాధి నిమిత్తం కరీంనగర్‌లో ఉంటూ ఆటో నడుపుతున్నాడు. కాగా, ఈనెల 4వ తేదీన భూక్య రాజు తన కుమారుడిని జనగామలోని ప్రభుత్వ వసతిగృహంలో చేర్పించేందు తండ్రి భూక్య జయరాం, అతని చెల్లెతో కలిసి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో తరిగొప్పుల బస్టాండ్ సమీపంలో టీ తాగేందుకు ఆగారు. ఈ క్రమంలో మండలంలోని జాలుబాయితండాకు చెందిన సభావత్ తరుణ్ ఆటో వద్ద అనుమానాస్పదంగా తచ్చాడుతుండగా భూక్య రాజు, జయరాం నిలదీయగా అక్కడి నుంచి పారిపోయాడన్నారు. అనుమానంతో ఆటోలోని డిక్కీలో వారు పెట్టిన పర్సును చూడగా కనిపించలేదు. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. కాగా, పరారీలో ఉన్న తరుణ్‌ను తన ఇంటి వద్ద బుధవారం అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి రూ.45 వేలు విలువగల వెండి కాళ్ల పట్టీలు, చెవి కమ్మలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. నిందితుడు తరుణ్‌ను జ్యుడీషియల్ రిమాండ్ కోసం జనగామకు తరలించామని వివరించారు.

పోస్టాఫీసుల ద్వారా జాతీయ జెండాల విక్రయం



రఘునాథపల్లి: ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా పోస్టాఫీసుల ద్వారా జాతీయ జెండాలను విక్రయిస్తున్నట్లు జనగామ సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ తెలిపారు. ఖిలాషాపూర్ బ్రాంచ్ పోస్టాఫీస్‌ను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఒక్కో జాతీయ జెండాను రూ.25కు విక్రయం నిమిత్తం జిల్లాలోని అన్ని పోస్టాఫీసుల్లో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఈనెల 12 వరకు ఆన్‌లైన్‌లోనూ కొనుగోలు చేసుకోవచ్చని, తపాలా శాఖ బట్వాడా సిబ్బంది ఇంటికి తెచ్చి ఇస్తారని పేర్కొన్నారు. సర్పంచ్ శ్రీధర్, కార్యదర్శి జ్యోతి, భాస్కర్ పాల్గొన్నారు.

కార్యదర్శిపై చర్య తీసుకోవాలి

బచ్చన్నపేట : గృహలక్ష్మి దరఖాస్తులకు అవసరమయ్యే ధ్రువపత్రాల జారీలో గ్రామ పంచాయతీ కార్యదర్శి కొర్రీలు పెడుతున్నాడని పోచన్నపేట గ్రామస్తులు శ్రీపతి నరేష్, మల్లేష్,హరీష్, నర్సింహులు తెలిపారు. గ్రామంలో బుధవారం వారు మాట్లాడుతూ గృహలక్ష్మి దరఖాస్తు చేసేందుకు ఇంటి పన్ను రసీదు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నాడని పేర్కొన్నారు. కాళ్లు మొక్కినా కూడా కనికరించడం లేదని వాపోయారు. తక్షణమే కార్యదర్శిపై చర్య తీసుకోవాలని అధికారులను కోరారు.

సంక్షిప్తంగా

మంత్రికి ఆహ్వానం

పాలకుర్తి: మండల కేంద్రంలో నిర్మించనున్న పద్మశాలి భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసేందుకు మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును పద్మశాలిలు ఆహ్వానించారు. ఈ మేరకు బుధవారం మంత్రిని సంఘం నాయకులు కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.

వైభవంగా ముత్యాలమ్మ బోనాలు

కొడకండ్ల: మండలంలోని రామవరంలో బుధవారం ముత్యాలమ్మ బోనాలను ఘనంగా జరుపుకొన్నారు. ఉదయం నుంచి ప్రజలు ఆలయానికి వెళ్లి సాంప్రదాయాలకనుగుణంగా కొబ్బరికాయలు కొట్టి మొక్కులు సమర్పించుకొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గృహ లక్ష్మి పథకం కింద పలువురు నుంచి దరఖాస్తులను స్వీకరించినట్లు ఎంపీడీఓ రఘురామకృష్ణ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ ఒక్క రోజే 500 పై చిలుకు దరఖాస్తులు వచ్చాయని అన్నారు.

వేలం ఆదాయం రూ. 33 వేలు

చిల్పూరు: మండలంలోని చిన్నపెండ్యాల గ్రామ సమీపంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి చెందిన సర్వే నంబర్ 368లోని మల్లంకుంట్ల చెరువు అరు ఎకరాల్లో చేపలు పెంచేందుకు వేలం నిర్వహించగా రూ. 33,300 ఆదాయం వచ్చినట్లు ఈఓ లక్ష్మీప్రసన్న, చైర్మన్ శ్రీధర్‌రావు తెలిపారు. బుధవారం దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మహేందర్ కుమార్, ఇన్‌స్పెక్టర్ సుమతి ఆధ్వర్యంలో సీల్డ్ టెండర్, బహిరంగ వేలం నిర్వహించారు. వేలంలో పెండ్యాల ఉపేందర్‌రావు, గుంటి మల్లయ్య, పేరాల రాజమౌళి, గుంపుల అశోక్‌రెడ్డి పాల్గొనగా ఉపేందర్‌రావు వేలం దక్కించుకున్నట్లు తెలిపారు.

ధూపదీప నైవేద్యానికి ముందుకొచ్చిన దాత

చిల్పూరు: కృష్ణాజీగూడెంలో ఉన్న పురాతన శివాలయంలో ఇక నుంచి ప్రతీ రోజు ధూపదీప నైవేద్యం అందించేందుకు నెలకు రూ. 2వేలు అందజేస్తానని ముందుకు వచ్చాడు గ్రామానికి చెందిన దాత పుట్ట రాజగోపాల్‌రెడ్డి. ఆలయంలో పూజారిగా కటకం లచ్చయ్య పనిచేస్తున్నాడు. భక్తులు వచ్చిననాడే దూపదీపం నైవేద్యం నిర్వహిస్తున్నట్లు నరసింహారెడ్డి కుమారుడు రాజగోపాల్‌రెడ్డి తెలుసుకుని ప్రతీనెల రూ.2 వేలు అందిస్తానని హామీ ఇచ్చారు.

ఆర్థికసాయం

తరిగొప్పుల: బొంతగట్టునాగారం గ్రామానికి చెందిన సుంకరి వెంకటయ్య అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. కాగా, బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిలువేరు సంపత్ బుధవారం పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు.

మణిపూర్ దాడులకు బీజేపీ బాధ్యత వహించాలి

జఫర్‌గఢ్: మణిపూర్‌లో చోటుచేసుకున్న హింసాత్మకమైన దాడులకు బీజేపీ పూర్తి బాధ్యత వహించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కూనూర్‌లో పెండ్యాల సమ్మయ్య అధ్యక్షత నిర్వహించిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న సీపీఐ జిల్లా నాయకుడు బొమ్మినేని వెంకట్‌రెడ్డిని ఆయన పరామర్శించారు.

సర్వాయి పాపన్న జయంతి

లింగాలఘణపురం: సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకల్లో భాగంగా బుధవారం మండలంలోని కళ్లెంలో కల్లుగీత కార్మిక సంఘం జెండాను గ్రామ అధ్యక్షుడు తాటిపాముల బాలకృష్ణ ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కళ్లెం పీఏసీఎస్ చైర్మన్ ఉపేందర్ మాట్లాడారు.

గోవర్ధనగిరిలో ట్రాక్టర్ చోరీ

రఘునాథపల్లి: మండలంలోని గోవర్ధనగిరిలో వ్యవసాయ క్షేత్రంలోని ట్రాక్టర్‌ను గుర్తు తెలియని దుండగులు చోరీ చేసినట్లు ఎస్సై రఘుపతి బుధవారం తెలిపారు. గ్రామానికి చెందిన ముప్పిడి రాజు వ్యవసాయక్షేత్రంలో కల్టివేటర్‌తో ఉన్న తన ట్రాక్టర్‌ను దున్నేందుకు పొలం వద్దే ఉంచాడు. ఉదయం వెళ్లి చూడగా ట్రాక్టర్ లేక పోవడంతో గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు గుర్తించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నియామకం

దేవరుప్పుల: యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన పులిగిల్ల వెంకన్నయాదవ్ నియామకమయ్యారు. ఈ మేరకు ఆ విభాగం జిల్లా అధ్యక్షుడు తాటికొండ వెంకట్‌యాదవ్ బుధవారం పత్రం అందజేశారు.

గృహలక్ష్మి దరఖాస్తు గడువు పెంచాలి

జఫర్‌గఢ్/పాలకుర్తి/దేవరుప్పుల: రాజకీయాలకతీతంగా అన్ని వర్గాల ప్రజల నుంచి గృహలక్ష్మి పథకం దరఖాస్తులు స్వీకరించేలా గడువు పెంచాలని పలు పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం వారు వేర్వేరుగా మాట్లాడారు. దరఖాస్తు గడువును నెలరోజుల పాటు పెంచాలని కోరారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీహరి, కాంగ్రెస్ పార్టీ నాయకులు సత్యనారాయణ, కృష్ణమూర్తి, ప్రదీప్‌రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సోమయ్యతోపాటు తదితరులు ఉన్నారు.